విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కాలయాపన లేకుండా స్పందన అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-భీమవరం: స్పందన లో వచ్చిన అర్జీదారుల సమస్యల పరిష్కారంతో పాటు మండల స్థాయిలో పరిష్క రించిన సమస్యలను పరిశీలించి సక్రమంగా ఉందో లేదో ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులకు సూచిం చారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అర్జీదారుల నుండి విజ్ఞాపనలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి కాలయాపన లేకుండా పరిష్కారం చేయాలన్నారు. పూర్తి పరిష్కారం చూపినప్పుడే అర్జీదారుని మన్ననలను పొందగలుగుతామన్నారు. సమస్య పరిష్కరించడంతోపాటు మండల స్థాయిలో పరిష్కరించిన సమస్యలను సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి ఆడిట్ చేయాలని కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.కృష్ణవేణి, జిల్లా జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ ఆఫీసర్ కే.సి.హెచ్ అప్పారావు, డి.ఎస్.పి బి. శ్రీనాథ్, డిపిఓ యం.నాగ లత, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పార్క్‌గా మున్సిపల్ పార్కు

విశాలాంధ్ర-భీమవరం: స్థానిక మారుతీ నగర్ మున్సిపల్ పార్క్ ను మునిసిపల్ స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని పుర పాలక సంఘం అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమ వారం మారుతీ నగర్ మున్సిపల్ పార్క్‌ను జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీలు చేసి మునిసిపల్ స్పోర్ట్స్ పార్క్ గా తీర్చిదిద్దాలని అన్నారు.పురపాలక సంఘం బడ్జెట్‌లో కొంత కేటాయింపు తో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సాయంతో సుందరవదనంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా యువతీ, యువకులకు ఆట,పాటలు తో పాటు మార్నింగ్ వాక్ కు ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని సుందరవదనంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పార్కుకు ఎక్కడా లోటు పాట్లు లేకుండా ప్రతి రోజు ఆటలు, పాటలు జరిగేలా ఎక్కువ మంది ప్రజలు వచ్చేలా నిర్వహణ చెయ్యాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి పురపాలక సంఘం అధికార్లకు సూచించారు.జిల్లా కలెక్టరు వెంట పురపాలక సంఘం కమిషనరు యస్. శివ రామకృష్ణ, ఇఇ విజయ్, ఏసీపీ గౌరు తదితరులు పాల్గొన్నారు.

వీరసైనికుడి తల్లికి ఇంటి స్థలం అప్పగింత

విశాలాంధ్ర-భీమవరం: యుద్ధంలో వీరమరణం పొందిన సిపాయి గంట్లా వీర వెంకట నాగ వర్ధన్ తల్లి గంట్ల వెంకటలక్ష్మికి వీరసైనికుల కుటుంబాలకు ఇచ్చే ఇళ్ల పట్టాలను కలెక్టర్ పి. ప్రశాంతి సోమవారం అందజేశారు. స్థానిక కలెక్టరు కార్యాల యంలోని స్పందన సమావేశ మందిరంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీరమాత వెంకటలక్ష్మికి 6 సెంట్ల ఇంటి స్థలం ఆకివీడు మండలం, అజ్జమూరు గ్రామంనకు సంబంధించిన పట్టాను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె.కృష్ణవేణి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి సాయిప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులానికి ఎంఎల్‌సి పదవి కేటాయించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరగ బోయే ఎంఎల్సి ఎన్నికలకు అభ్యర్థిగా గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టి బొమ్మ శ్రీరామచంద్రమూర్తిగౌడ్, కాగిత అచ్యుత పూలే, మోదుగుమూడి శివరామకృష్ణ గౌడ్, ఆరేపల్లి నాగ వెంకట శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక తంగేడు మూడు చిట్టి బొమ్మ రంగారావు గౌడ్ స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తొలి నుండి గౌడ సామాజిక వర్గం వివక్షకు గురవు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుని ప్రధాన వృత్తిగా చేపట్టి జీవనం సాగిస్తు న్నారని తెలిపారు. గౌడ సామాజిక వర్గం అభివృద్ధి కోసం చట్టసభలలో తగిన ప్రాతినిధ్యం ఉండాలన్నారు. వచ్చే నెలలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గౌడ కులానికి ఒక ఎంఎల్సి సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వామ్మో.. కరెంటు బిల్లు

విశాలాంధ్ర - లింగపాలెం : ఇంట్లో ఉంటున్నది ఒక్కడే. రెండు బల్బులు, ఒక ఫ్యాను మాత్రమే ఆ ఇంట్లో ఉన్నాయి. ఈ ఒక్క వ్యక్తి పగలు ఇంట్లో ఉండడు. కాని ఇతనికి కరెంటు బిల్లు ఏడు వేల రూపాయలు వచ్చింది. దీంతో బావురుమంటూ స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. లింగపాలెంకు చెందిన పింగుల జాన్‌కు భార్యలేదు. ఆడ పిల్లలు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళారు. ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. కరెంటు బిల్లు రూ. 7 వేలు వచ్చింది. ఇలా ఒకసారి కాదు.. ఇదే బిల్లు వరుసగా ఏడు నెలల నుంచి వస్తుందని లింగపాలెంలో జరిగిన స్పందనలో అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశాడు. దీనిపై అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది విన్న వారంతా అయ్యో ఇదేంటంటూ సానుభూతి చూపుతూ విద్యుత్ శాఖ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆర్అండ్ఆర్ అడ్మినిస్ట్రేటర్‌ను కలిసిన ఎంపీపీ

విశాలాంధ్ర - వేలేరుపాడు : గత సర్వేలను పరిగణలోకి తీసుకొని ఇంటి విలువలను ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ముంపు గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రకటిస్తున్న ఇంటి విలువలు గతం కంటే పూర్తి భిన్నంగా ఉన్నాయని పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి విలువలను ఇవ్వాలని, అలాగే అన్ని అర్హతలు కలిగిన యువతకు ప్యాకేజీ వర్తింపచేయాలని, గోదావరి వరదలు వలన నష్టపోయిన వారికి వెంటనే పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూత్ నాయకులు బద్దె ప్రేమ్ కుమార్, ఆర్ అండ్ అర్ కాలనీ అధ్యక్షుడు గిళ్ళ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పేరుమళ్ళ నరసింహ రావు తదితరులు వినతి పత్రం అందజేశారు.

ఇరువురు విద్యార్థినుల అదృశ్యం

- పోలీసుల గాలింపు

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంకు చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇరువురు విద్యార్థినులు ఇదే గ్రామంలోని హైస్కూల్‌కు సోమవారం వెళ్ళారు. మధ్యాహ్నభోజనం తరువాత వీరు కనిపించలేదు. హాజరు వేస్తున్న సమయంలో వీరు లేరు. దీంతో తల్లిదండ్రులను విద్యార్థినులు ఇంటికి వచ్చారా అంటూ హెచ్ఎం అడిగారు. తల్లిదండ్రులు రాలేదని చెప్పడంతో హెచ్ఎం శ్రీలక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ చెన్నారావు కేసు నమోదు చేశారు. విద్యార్థినుల కోసం గాలింపు చేపట్టారు.

ప్రతి నిర్వాసితుడికి సీపీఐ అండ

రాష్ట్ర కార్యదర్శి దృష్టికి నిర్వాసితుల సమస్యలు

విశాలాంధ్ర - వేలేరుపాడు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దృష్టికి నిర్వాసిత సమస్యలను తెలియజేస్తూ సోమవారం ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన రాష్ట్ర కార్యదర్శిని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు చెందిన నాయకులు కలిసి నిర్వాసితులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. ముంపు ప్రాంతాల్లో నష్టపోతున్న ఇళ్లకు ఇచ్చే స్ట్రక్చర్ విలువను పూర్తిగా తగ్గించి నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తున్నారని వాపోయారు. 2017 సంవత్సరంలో నిర్వాసితులు ఇళ్ళ సర్వేలు నిర్వహించి ఇచ్చిన విలువలకు నేడు ప్రకటిస్తున్న విలువలకు ఏమాత్రం పొంతన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి మూడు వంతులు విలువను తగ్గించారని పేర్కొన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామ సభలను బహిష్కరించి నిర్వాసిత సమస్యలను ముక్తకంఠంతో పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం : వివరాలు తెలుసుకుని సానుకూలంగా స్పందించిన రాష్ట్ర కార్యదర్శి నిర్వాసితులకు న్యాయం చేయా లని డిమాండ్ చేస్తూ మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయి వరకు సీపీఐ అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి నిర్వాసితుడికి అండగా ఉంటామని నష్టపో తున్న చివరి కుటుంబం వరకు పూర్తి ప్యాకేజీ అందే వరకు సిపిఐ పోరాటం చేస్తుందని భరోసా కల్పించి నట్టు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, వేలేరుపాడు కుక్కునూరు మండల కార్య దర్శులు బాడిశ రాము, మైసాక్షి వెంకటాచారి, రామ వరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, కారం దారయ్య, కొన్నే లక్ష్మయ్య, శ్యామల, సోడే నాగేష్ తదితరులు ఆయన్ను కలిసారు.

మల్ల సముద్రం చెరువు అక్రమ తవ్వకాలు

- బహిర్గతం చేసిన విశాలాంధ్ర కథనానికి ప్రజల మద్దతు
- అధికారులు తీసుకునే చర్యల కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని మల్లసముద్రంపై మట్టి మాఫియా శీర్షికన విశాలాంధ్రలో సోమవారం ప్రచురించిన కథనం ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మట్టిమాఫియా ముఠాపై ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అంటున్నారు. మల్లసముద్రం చెరువులో అడ్డూఅదుపు లేకుండా మాఫియా గ్యాంగ్ అక్రమంగా మట్టిని తవ్వి అమ్మేసుకోవటం వల్ల చెరువుకు ప్రమాదం ఏర్పడుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. దీనిని నిరోధించాలని అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడటంలేదు. దీనిపై నాయకులు ఆగ్రహంతో ఉన్నారు. పైగా జగనన్న కాలనీకంటూ మధ్యపెట్టి మట్టిని మాఫియా గ్యాంగ్ అమ్మేసుకుంటున్నారు. ధర్మాజీగూడెం కాలనీల ఇళ్ళ నిర్మాణం పూర్తి స్థాయిలో జరగటంలేదు. వీటి పేరుతో అమ్మేస్తున్నారు. ఈ గ్యాంగ్‌కు ఇరిగేషన్ శాఖలోని ఒక అధికారి సహకారంతో పాటు స్థానికంగా కొందరు ఉద్యోగులు సహకరిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు జోక్యం చేసుకోవటంలేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే మట్టి తవ్వకాలు ఆగిపోతాయని ఆశపడుతున్నారు.

పేదలసొంతింటి కల నెరవేర్చడమే సీఎం లక్ష్యం

విశాలాంధ్ర - గణపవరం: పేదల సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న లక్ష్యమని జగనన్న కాలనీలలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపటా లని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. సోమవారం గణపవరం వైయస్సార్ జగనన్న హౌసింగ్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ళ పురోగతిని స్థానిక నాయకులుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పేదలంరికీ ఇళ్ళు కార్యక్రమం అమలులో భాగంగా ప్రతి పేదవాడికి గూడు కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గణపవరం జగనన్న కాలనీలలో లేబెట్లలో నీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం , ఇతర వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇండ్ల నిర్మాణాలు వేగం పుంజుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం గ్రామ సర్పంచి మూరా అలంకారం, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దండు రాము, మాదేటి సురేష్ కుమార్, తోట శ్రీను, కొండేటి వెంకటరత్నం, చనుమూరి శివ, బత్తి అరుణ్, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ మూసివేత నిలుపుదల

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వరావుపేట రోడ్డులో ఆర్య వైశ్య కళ్యాణ మండపానికి వెళ్లే జంక్షన్ లో రోడ్ డివైడర్ కటింగ్ మూసి వేయటానికి అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వర రావు ఎమ్మెల్యే ఎలిజా తో మాట్లాడి డివైడర్ ను మూసివేయకుండా తెరిపించే ఏర్పాటు చేశారు. ఈ డివైడర్ మూసివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశ్యంతో డివైడర్ మూసివేయకుండా ఎమ్మెల్యే సహకారంతో నిలిపివేసినట్లు వందనపు వెంకటేశ్వరరావు తెలిపారు.ఆ ప్రాంత వ్యాపారులు డివైడర్ మూసివేయకుండా సహకరించిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వర రావు , స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ వందనపు సాయి బాల పద్మ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బత్తిన చిన్న లకు కృతజ్ఞతలు తెలియజేశారు .

తనిఖీ నివేదికపై సమీక్ష

విశాలాంధ్ర -ఏలూరు : జిల్లాస్థాయిలో వివిధ జిల్లా శాఖల అధికారులు నిర్వహి స్తున్న తనిఖీ నివేదికపై సోమవారం గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలపై అధికారులకు తగు సూచనలు చేశారు. వీటిలో అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యత, కోడిగ్రుడ్లు పంపిణీ, పిల్లల బరువు, ఎత్తు, ప్రదర్శించే చార్ట్ ల ఏర్పాటు, పారిశుధ్యం, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారంపైన, సర్వే ప్రకారం రక్తహీనత పైన, వారానికి ఒక రోజు ఆకుకూరల్లో మునగ ఆకు ఉపయోగించాలని, పిల్లలకు నేర్పిస్తున్న విద్య పైన పాఠశాలలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజనం నాణ్యత లోపిస్తే ఏజెన్సీని మార్చాలని, వంటలు చేసే షెడ్లలోనే వంటలు చేయాలని, పాఠశాల పనులకు సంబంధించిన మెటీరియల్ భద్రత ప్రదేశాల్లో ఉంచాలి తప్ప, విద్యార్థులు ఆడుకునే క్రీడా మైదానాల్లో వేయకూడదని సూచించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ డిఎ పిడి విజయరాజు, డిపిఓ మల్లిఖార్జునరావు, హౌసింగ్ పిడి వేణుగోపాల్, డిఎంహెచ్ఓ ఇన్ చార్జి డాక్టర్ నాగేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జేడి మధుసూధనరావు, వ్యవసాయశాఖ జేడి రామకృష్ణ, తదితర వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 13 అర్జీలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంసబ్ డివిజన్ అధికారి వారి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పోలీస్ స్పందన కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయని ఎస్పి యు రవి ప్రకాష్ తెలిపారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.

ఎంఎల్‌సీ ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎం.కె.మీనా కు తెలియజేసారు. రాష్ట్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి ఎం.కె.మీనా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలో ఏర్పాట్లను గురించి రాష్ట్ర ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 5 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామన్నారు. ఎంసీసీ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఒక కేసు నమోదైందని, ఎఫ్.ఐ.ఆర్. కూడా నమోదైందన్నారు. సవివరమైన నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలియ జేసారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుపై నివేదిక సమర్పించడం జరిగిందని, సవరించిన నివేదికను వెంటనే సమర్పిస్తామని కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలియజేసారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఎం.కె. మీనా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణపై అందిన అభ్యంతరాలను మంగళవారం లోగా పరిష్కరించాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి. అరుణ్ బాబు, జిల్లా రెవిన్యూ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఏ.వి.ఎస్.ఎస్. మూర్తి, జిల్లా పరిషత్ సిఈఓ కె. రవికుమార్, ఆర్డీఓ కె. పెంచెల్ కిశోర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రమాదేవి, , ప్రభృతులు పాల్గొన్నారు.

నామినేషన్లు నిల్

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు తెలియజేశారు.

జిల్లా పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా ఓటర్లు 430 మంది

విశాలాంధ్ర- భీమవరం : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో భీమవరం, నరసాపురం డివిజన్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కి సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా దావాలు మరియు అభ్యంతరాల పరిష్కారం, డుప్లికేట్, సందేశాత్మక ఓట్లు, బ్యాలెట్ బాక్సులు, ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలోని భీమవరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 ఓట్లు మొత్తం 430 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు, భద్రతా ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణ వేణి, భీమవరం ఆర్డీవో దాసి రాజు, ఎంసిసి నోడల్ అధికారి కెసిహెచ్ అప్పారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎం.డి నజీముల్లాషా, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-తణుకు : అంతర్జాతీయ చిత్ర లేఖన పోటీల్లో ఎస్. కె. ఎస్. డి మహిళా కళాశాల 11 మంది విద్యార్థినులు సర్టిఫికెట్స్, మెడల్స్ అందుకొని ప్రతిభచాటారు. భారత దేశ సంస్కృతి వృద్ధి కొరకు పనిచేసే "చారు కేస్టిల్ ఫౌండేషన్ గజియాబాద్, ఉత్తరప్రదేశ్ వారి ఆధ్వర్యంలో సంస్కృతీ కి రంగ్ అంతర్జాతీయ చిత్ర లేఖన పోటీల్లో 15 దేశాల నుండి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా ఎస్. కె. ఎస్. డి మహిళా కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థినులకు మెడల్స్ రావడం గర్వకారణమని కళాశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి అన్నారు. అనంతరం మెడల్స్ గెలుపొందిన విద్యార్థినులను అభినందించారు. జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, పరిపాలనాధికారి డాక్టర్ డి. సుబ్బారావు, కె. పద్మజరాణి, అధ్యాపక, అధ్యాపకేతరసిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేది జగన్

విశాలాంధ్ర-ముసునూరు: మళ్లీ అధికారంలోకి వచ్చేది జగన్ ప్రభుత్వమేనని నూజివీడు నియోజక వర్గ శాసనసభ్యలు మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం మండలంలోని ముసునూరు గ్రామంలో మా నమ్మకం మా జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ గృహ సారధులు, సచివాలయం కన్వీనర్లనుద్దేశించి మాట్లాడుతూ నవరత్నాల పేరిట అందించిన పలు సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయా? లేదా ? అడిగి ఏ ఇంటికి ఏ పథకం అందిందో వారికి వివరంగా తెలియచేసి మరల జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచ్‌లు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో పిల్లల్లో నైపుణ్యం వెలికితీత

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థుల్లో దాగివున్న వ్యక్తిగత నైపుణ్యాన్ని వెలికి తీయడానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా నగర బాలికల ఉన్నతపాఠశా లలో రెండు రోజుల పాటు నిర్వహించే ఏలూరు జిల్లాస్థాయి విద్యా,వైజ్ఞానిక, సైన్స్ ఎగ్జిబిషన్ జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు ఉపయోగపడేలా వినూత్న ఆలోచనలతో వారిని మరింత ముందుకు వెళ్లేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే వైజ్ఞానికం పై మక్కువ కలిగేలాగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశనుంచే చదవుతోపాటు వైజ్ఞానికంపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఉత్తమ శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాస్థాయిలో మొదటి రెండు స్థానాల్లో గెలుపొందిన వారిని ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనకు పంపనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించి అనంతరం ప్రదర్శనలో ప్రదర్శించిన వైజ్ఞానికి విషయాలను విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి రవిసాగర్, జెడ్పీ సిఇఓ రవికుమార్, డిపిఓ మల్లిఖార్జునరావు, డిఆర్ డిఏ పిడి విజయరాజు, డ్వామా పిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ

విజయ కేతనం పుస్తకాన్ని విడుదల చేసిన కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో పదవ తరగతి 2022-2023 సంవత్సరానికి వెనుకబడిన విద్యార్థులకు 40 రోజుల ప్రత్యేక కార్యాచరణగా రూపొందించిన 'విజయ కేతనం' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ వి రవిసాగర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందించిన 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక "విజయ కేతనం" పుస్తకాన్ని విద్యాశాఖ పరంగా విద్యార్థులకు అందించనున్నట్టు తెలిపారు. కోవిడ్ వలన పదవ తరగతిలో పరీక్షా ఫలితాలు నిరాశా జనకంగా ఉండటం వల్ల నాణ్యమైన విద్యను అందించుటకు అవకాశం లేకుండా పోయిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ వెనుకబడిన విద్యార్థుల కోసం, అందరూ ఉత్తీర్ణత సాధించాలనే సదుద్దేశంతో అన్ని సబ్జెక్టులలో నైపుణ్యాలతో కూడిన ఉపాధ్యాయులచే 'విజయ కేతనం' పుస్తకాన్ని రూపొందించి కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మండల విద్యాశాఖాధికారి సత్యత నరసింహామూర్తి, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఏలూరు అర్బన్ డి. సాంబశివరావు, డిసిఇబి సెక్రటరీ అంగుళూరి సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు జిజిఎ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఫ్లెక్సీలు తీయలేదు

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినప్పటికీ సోమవారం ఏలూరు జిల్లా నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామంలో తెలుగుదేశం, వైసీపీ నాయకుల ఫ్లెక్సీ బోర్డులు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్టు ఇక్కడ కానరాలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయాన్ని అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు ఎన్నికల కోడ్ ను అమలు చేసి డి గోపవరంలో ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సోషల్ జస్టిస్ డే

విశాలాంధ్ర - చింతలపూడి : సోషల్ జస్టిస్ డే ను పురస్కరించుకుని భాష్యం హైస్కూల్‌లో చింతలపూడి జడ్జి ఎస్‌కె ఇబ్రహీం షరీఫ్, చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాధ్యతలను వివరించారు. ధనిక, పేద, కుల, మత, తెలుపు, నలుపు అనే తేడా లేకుండా అందరూ ఒక్కటే నని అదే సోషల్ జస్టిస్ ముఖ్య ఉద్దేశమని, చిన్నప్పటి నుండి పిల్లలు అందరూ సమానమనే భావన కలిగి వుండాలని, చట్టం అందరికీ ఒక్కటే నని దానికి ధనిక, పేద అనే తేడా వుండదని, తప్పు చేస్తే ఎవరైనా శిక్షకు అర్హులని, పిల్లలు తల్లితండ్రులను గౌరవించాలని, అనుకున్న లక్ష్యాలు సాధించాలనే పట్టుదల కలిగి చదువు కోవాలని, చదువుతో పాటు సంస్కారం కలిగి జీవించి, భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. ఇందులో న్యాయవాదులు పింగుల డేవిడ్ రాజు, పట్నాల శ్రీనివాసు, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, స్కూల్ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ. సిబ్బంది పాల్గొన్నారు.

త్రిమూర్తులు కుటుంబానికి ధర్మరాజు పరామర్శ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం గ్రామ వాస్తవ్యులు తోట బాబి తండ్రి తోట త్రిమూర్తులు ఇటీవల మరణిం చారు. వారి కుటుంసభ్యులను ఫౌండేషన్ చైర్మన్ పత్సమట్ల ధర్మరాజు, ఆయనతో పాటు జనసేన నాయకులు పొత్తూరి కృష్ణంరాజు, తోట పవన్, గోలి సాయి పుండరీకాక్షుడు, ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, గ్రామ జనసైనికులు కలిసి పరామర్శించారు.

వెంకటేశ్వర మృతికి సంతాపం

విశాలాంధ్ర-కామవరపుకోట : పాలకొల్లుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వెన్నకోట వెంకటేశ్వర మృతికి ఏపీయూడబ్ల్యూజే కామవరపుకోట మండల శాఖ గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు, అధ్యక్ష కార్యదర్శులు వీరమల్ల మధుసూదన్ రావు, కడిపిపాపారావు సంతాపం తెలిపారు. విన్న కోట వెంకటేశ్వరరావు జర్నలిస్ట్ గానే కాక కార్మిక నేతగా శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. ఆయన కార్మికులకు రావలసి రాయితీలను రాబట్టడంలో వరకు పోరాడారని జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేశారని అన్నారు. ఆయన మృతికి కంకిపాటి బుచ్చిబాబు, చలమల శ్రీనివాసరావు, ఎం. దుర్గారావు, జి. సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

తారకరత్న లేని లోటు తీర్చలేనిది

విశాలాంధ్ర -నూజివీడు టౌన్ : నందమూరి తారక రత్న లేని లోటు టీడీపీకి తీర్చలేనిదని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దర బోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకరత్న టీడీపీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. కష్టకాలంలో ఎప్పుడు పార్టీకి అండగా నిలుస్తూ కార్యకర్తలను ముందుండి నడిపేవారిని కోల్పోవడం తమను కలచి వేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకట రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తలపంటి రాజశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు , రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం , నూజివీడు మండల క్లస్టర్ ఇన్‌చార్జి యనమదల సత్యనారాయణ (నాని)తదితరులున్నారు.

వేమన శతకాలు చదివిన విద్యార్థులు

విశాలాంధ్ర-తణుకు : తణుకు స్వర్ణా క్లబ్, మాతృభాష పరిరక్షణ సమితి వారు సోమవారం 108 సార్లు వేమన శతకాలను 500 మంది చిన్నా రులచే చదివించే బృహత్తర కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర బీసీ నాయకురాలు, రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళా దేవి ఆర్థిక సహాయంతో క్లబ్ సభ్యులు లయన్ బూరుగుపల్లి వెంకట్రావు,లయన్ బూరుగుపల్లి లలిత,లయన్ సుబ్బరాజు పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సుమారు 500 మంది కి వ్యక్తిత్వవికాస పుస్తకాలు, కార్యక్రమ నిర్వహణా వ్యవస్థకు 2000రూపాయలు అందజేశారు. ఈసందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ఇలాంటి సంస్థల ద్వారా నేటి విద్యార్థులకు మన భాషలోని మాధుర్యం, విజ్ఞానం పెరగ టానికి దోహదపడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో స్వర్ణాక్లబ్ నాయకులు ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల నుండి అనేక స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.5000 మంది చిన్నారు లచే వేమన శతకాలు, జాతీయ గీతాలాపన వంటి కార్యక్రమాలతో కార్యక్రమం నిర్వహించారు.

ధైర్య సాహసాలు బాల్యం నుంచే రావాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ధైర్య సాహసాలు బాల్యం నుంచే రావాలని, అటువంటి కోవలో వినూత్నంగా చేసిన సాహసం గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో సాహస బాలిక జాతీయ అవార్డు గ్రహీత వినూత్నను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభినందించి సత్కరించారు. ఒక ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించడం తక్కువని, దగ్గరకు వెళ్ళి సహాయం చేసే సంఘటనలు తక్కువేనని, అలా అరుదుగా వినూత్నంగా చేసిన సాహసం సమాజానికే ఆదర్శమని అన్నారు. తాను ప్రమాదంలో చిక్కుకుని తన ప్రాణాలతో పాటు నలుగురు ప్రాణాలు కాపాడిన వినూత్నను అభినందించారు. ఎంబీబీఎస్ లో ఉచిత సీటు సాధించడం వినూత్న చేసిన మరో సాహసంగా భావిస్తున్నానని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వినూత్న తల్లి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - కలిదిండి: ఐదు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి వార్షిక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం కలిదిండి శివారు భోగేశ్వర లంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు వసంతోత్సవం, త్రిశూల స్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పూర్ణాహుతి కార్యక్రమాలతో ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేశారు. ఈవో శింగనపల్లి. శ్రీనివాసరావు, వంశపారంపర్య ధర్మకర్తలు అడవి. వెంకట గంగాధర శర్మ, ధర్మకర్తను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేయండి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : మండలంలోని పిన్నరెడ్డి పల్లి, నుగొండపల్లి, రాజరం గ్రామాల్లో సభ్యత్వ చేర్పింపుపై వలంటీర్లు,,గ్రామ ముఖ్య నాయకులతో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ సమావేశం నిర్వహించారు. 500 రూపాయలు పెట్టి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షలు ప్రమాద బీమా ఉంటుందని రూ. 50వేలు వరకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండలం ప్రధాన కార్యదర్శిలు యలవర్తి సువర్ణ బాబు, మల్లవల్లి శివరాంప్రసాద్, పిన్నారెడ్డిపల్లి గ్రామ నాయకులు బొడ్డు ఆనంద్ కుమార్, చోడవరపు ప్రతీప్,ఉదయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : నందమూరి తారక రత్న మృతి పార్టీకి తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు నందమూరి తారకరత్న మృతిపై సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చిన్న వయసులోనే తారకరత్న గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, బలుసు నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పూలపల్లి వెంకటరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల అరుణ, రాచూరి మదన్, గెడ శ్రీరామచంద్రమూర్తి, పెద్దిరెడ్డి, కర్రీ సత్యనారాయణ, సంకు కృష్ణా, పైడిమల రమేష్, ఊడిగా పెంటయ్య, నాయుడు లీలాకాంత్, టైలర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని నందరాడ నరేంద్రపురం గ్రామంలో ఉన్న సీలింగ్ భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు,కార్యదర్శి జన్నుపల్లి సత్తిబాబు, పి.వెంకట్ నాయుడు అన్నారు. నందరాడ నరేంద్రపురం గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక కాండ్రేగుల జోగిజగన్నాథం బహుదూర్ అన్నదాన సత్రం నుండి గాంధీబొమ్మ,బస్టాండు, మీదుగా ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ ఎన్. ఎస్.పవన్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ నందరాడ,నరేంద్రపురం గ్రామాల పరిధిలోని 435/6,7,429/2ఏబి సర్వే నెంబర్లలో ఎనిమిది ఎకరాల ఇరవై నాలుగు సెంట్ల భూమిని ఆయా గ్రామాలకు చెందిన 40మంది నిరుపేద కుటుంబాలు గత 18 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఇటీవలే ఆయా భూముల్లో అవకతవకలు జరిగాయని,సదరు భూమి విషయం కోర్టులో ఉండగానే కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు జరిగాయని మండిపడ్డారు. పట్టాదారు పేర్లు అడంగుల్లో నమోదు చెయ్యాలని కోరారు. అదేవిధంగా రాజానగరంలో కాలవ గట్టుపై వేసుకున్న పాకలకు ప్రభుత్వమే విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. దింతో తహశీల్దార్ పవన్ పై సమస్యలు పై చర్చించి,సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జి.సూరిబాబు, డివిజన్ నాయకులు ఎం.వెంకన్న, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, నక్క లక్ష్మి,చిరుకూరు నాగమ్మ, షేక్ బేబీ, కడియాల దుర్గారావు, పాలిసెట్ సన్నాసమ్మ, గుత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య సివిల్ విభాగంలో విజ్ఞానదాయకంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక రోజు ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఈవెంట్‌ను నిర్వహించినట్లు విభాగాధిపతి డా ఎన్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 40 బృందాలుగా పాల్గొన్నారు. వారు పోస్టర్లు మరియు నమూనా ద్వారా తమ వినూత్న ఆలోచనలు అద్దంపట్టే విధంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఆద్యంతం విజ్ఞానదాయకంగా సాగింది. ప్రదర్శించబడిన అన్ని ప్రాజెక్టులు వేటికవే ఉత్తమంగా ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సివిల్ విభాగాధిపతి ప్రొ నాగ సాయి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల నూతన ఆవిష్కరణలలో అత్యుత్తమ టాప్ 04 ప్రాజెక్టులను ఎంపికచేయడం జరిగింది. ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులలో దాగియున్న వినూత్న ఆలోచనలను పరస్పరం పంచుకొనుటకు, వారిలో దాగి ఉన్న ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులకు చక్కటి వేదికను అందించడం అని అన్నారు. మరియు వారి సామర్థ్యాన్ని ఆవిష్కరించడం మరియు విద్యార్థులు వారి అభ్యాస అనుభవాన్ని ప్రదర్శించడానికి అవకాశం కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో .కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, హెచ్ఓడీలు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజు మృతిపై విచారణ జరపాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : వాలు తిమ్మాపురం రోడ్డులో ఉన్న పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో మరణించిన కార్మికుని మృతిపై సమగ్రవిచారణ జరపాలని సిఐటియు పెద్దాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి క్రాంతి కుమార్‌లు డిమాండ్ చేసారు. కార్మికుడు కనిపించకుండా పోయిన దగ్గర నుండి కంపెనీ యాజమాన్యం వింతవాదనలు చెబుతుందని ఆరోపించారు. కార్మికునికి కనీసం కంపెనీ నుండి పిఎఫ్, ఇఎస్ఐ కట్టలేదని దీనితో కుటుంబం మొత్తం దిక్కుతోచని స్థితిలో నెట్టబడిందని అన్నారు. వర్క్ మెన్ కాంపన్ సేషన్ యాక్ట్‌లో ఫ్యాక్టరీ ఇన్స్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేసారు. నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. జి రాగంపేటలో వర్కర్ల మృతి చెందిన ఘటన మరువక ముందే పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లో వర్కర్ మరణించారని అన్నారు. పనిలో దుమ్ముదూళితో కనీస భద్రత ప్రమాణాలు లేక మరణించారని, దీనికి యాజమాన్యమే పూర్తి భాధ్యత వహించాలని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ కట్టకపోతే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపైన ఉన్నతాధికారులకు సిఐటియుగా నివేదిస్తామని ప్రకటనలో తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ, వర్క్ మెన్ కాంపన్ షేషన్ యాక్ట్ ప్రకారం ఎంత వస్తుందో ఆ మొత్తం కంపెనీ కార్మికుడు గౌరిశెట్టి రాజు కుటుంబానికి అందించాలని డిమాండ్ చేసారు. కంపెనీ యాజామాన్యంపై కేసునమోదు చేయాలని డిమాండ్ చేసారు.

కల్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-టి.నరసాపురం : శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ప్రాంగణంలో 27వ కళ్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా చిన కాశీగా పేరొందిన స్థానిక శివాలయంలో వేలాది మంది భక్తుల సహకారంతో ఐదు రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఆఖరి రోజు అఖండ అన్న దాన వితరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి,పసుమర్తి రాము,దేవరపల్లి సీతా రామ ప్రసాద్,కన్నం సర్వేశ్వర రావు,వెజ్జు బాలరాజు, నల్లూరి శ్రీను,లింగారెడ్డి శ్రీను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు/శంఖవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన ఉరుకుట్టి శివ దుర్గ తండ్రి ఉరుకుట్టి రాంబాబు ఇటీవల అకారణంగా మరణించారు. ఈ సందర్భంగా సోమవారం ఉరుకుట్టి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రత్తిపాడు నియోజకవర్గం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గొంప శివకుమార్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. కిర్లంపూడి మండలం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నైదాన రఘు, బర్ల లోవరాజు, సారీపల్లి రమేష్, మచ్చర్ల శ్రీనివాస్, కోన గంగాధర్ తదితరులు పరామర్శించారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు 13 నెలల బకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలు కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలంటూ జిల్లా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నిమ్మకాయల వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 2021 సంవత్సరంలో 7 నెలలు బకాయి జీతాలు ఉన్నాయని 2022లో సంవత్సరంలో 6 నెలల బకాయి జీతాలు ఇవ్వవలసి ఉందని అన్నారు. ఇన్నేసి నెలలు జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఏంతిని పనిచేస్తారని డిఎల్‌పిఓని నిలదీశారు. డిఎల్‌పిఓ మాట్లాడుతూ 2021లో ఏడు నెలలు ఇవ్వాల్సింది వాస్తవమేనని దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేయవలసి ఉందని చెప్పారు. 2022 సంబంధించి వెంటనే బకాయి జీతాలు చెల్లిస్తామని ముందుగా రెండు నెలకు జీతాలు ఇస్తామని డిఎల్‌పిఓ టీ కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి తక్షణమే జీతాలు ఇవ్వాలని ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగడం నాగేశ్వరరావు, పందు నాగభూషణం, వడ్డీ సాక్షి, పాచ్చిమాల శ్రీరాములు, జగడం సత్యనారాయణ, రాజేష్, తదితరులు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.

శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

విశాలాంధ్ర - ఐ పోలవరం/మురమళ్ళ : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కి భక్తురాలు విరాళం సోమవారం అందించారు. తాపేశ్వరం వాస్తవ్యులు సలాది, సాయి సత్య నవీన్ రూ.14000 (పద్నాలుగు వేలు) రూపాయలు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణలకి అందించారు. తొలుత దాతను ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేసి సత్కరించారు. నిత్యం స్వామి వారి ఆలయంలో రాత్రి కల్యాణానికి విచ్చేసే భక్తులకు శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదాన పథకాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది.

సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

విశాలాంధ్ర - ఆలమూరు : రబీ వరి సాగులో ఎలుకల బెడద నుంచి రక్షించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు మండల వ్యవసాయ అధికారిని ఎస్ లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో రైతులకు ఎలుకలు నివారణ మందును పంపిణీ చేశారు. మండలంలో ఒకేరోజు అన్ని గ్రామాలలో రైతులకు ఒకేసారి ఎలుకల నివారణకు తయారు చేసిన ఎర్రను అందించడం జరుగుతుందని ఏవో లక్ష్మీ లావణ్య తెలిపారు. మండలంలో 9750 ఎకరాలలో రబీ సాగు జరుగుతుందని రైతులందరికీ ఈ మందును ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పృథ్వీ పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-ఎ.కొండూరు : రాజకీయ పార్టీలకు, కుల మతాలకతీతంగా అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఎ. కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన పట్ల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరవేస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్యాగనియా, వైస్ ఎంపీపీలు, గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, సర్పంచ్ వెంపాటి రజిని, తహసీల్దార్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి వి ఎస్ నాగేశ్వరరావు, ఎంఈఓ ఎం.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుసమస్యలపై ఉద్యమించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్

విశాలాంధ్ర-చల్లపల్లి : రైతు సంఘాలను బలోపేతం చేసి రైతు సమస్యలపై ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గం సమావేశం సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆజాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి రైతు సంఘాలను బలోపేతం చేసి రైతు సమస్యలపై పోరాడాలన్నారు. ఆర్‌బికే ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతుందని విమర్శించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత నెలలో రైతులు తోలిన ధాన్యానికి ఇప్పటివరకు నగదు జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. కూలీలకు రైతులు గట్టుమీదే నగదు చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో రైతుల బాధ వర్ణన జీవితంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరి మాసూరు చేసిన రైతులు ఆర్ బి కే సెంటర్లోకి వెళితే అక్కడ సైట్ ఓపెన్ అవ్వటం లేదని, అధికారులు జిల్లా టార్గెట్ పూర్తయింది అని చెబుతున్నారని రైతులు వాపోతున్నట్లు తెలిపారు. గత సంవత్సరం మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు జరగగా ఇప్పుడు జిల్లా టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరం గా మారిందని తెలిపారు.రైతు పండించిన ధాన్యాన్ని చివరికించే వరకు కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రాలు రైతులకు భరోసా కల్పించలేక పోతున్నాయని వాపోయారు. రైతు సంఘం జిల్లా మహాసభలు ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు ఆజాద్ ప్రకటించారు. ఈ మహాసభల నాటికి గ్రామస్థాయి నుండి రైతు సంఘాలు బలోపేతం కావాలని కోరారు. త్వరలోనే మహాసభ జరగబోయే తేదీని, ప్రదేశాన్ని ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులతో కలిసి చల్లపల్లి తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వేమూరి రత్నగిరి రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు కొండయ్య, పరుచూరి శ్రీనివాసరావు, మాలెంపాటి కాంచనరావు, స్థానిక నాయకులు పరుచూరి వెంకన్న బాబు, బండి రామకృష్ణ, కొర్రపాటి ముఖర్జీ, మాలెంపాటి కోటేశ్వరరావు, కొల్లూరు శ్రీధర్, కోడె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాలపై దాడి దారుణం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై వైసీపీ కార్యకర్తల దాడి చేయడాన్ని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాడిపత్రి తాతయ్య సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలు వారు ఎవరి అభిప్రాయాలు వాళ్ళ ప్రచారం చేసుకుంటారు. ఈ హక్కులకి భంగం కలిగించే విధంగా ఒక పార్టీ వారు ఇంకొక పార్టీ కార్యాలయాలపై దాడిచేసి తగలబెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పదవిలో ఉన్నాం కదా అని ప్రతిపక్షాలపై ఇటువంటి దాడులు చేయడం హేయమైన చర్యగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు కలగజేసుకొని గన్నవరం ఏరియాలో శాంతిభద్రతలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విశ్వాసం కోల్పోతున్న 'స్పందన'

విశాలాంధ్ర-విజయవాడ : ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ప్రజలలో విశ్వాసం కోల్పోతుందని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి టి.తాతయ్య సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. సుదూర ప్రాంతం నుంచి ఎంతో ఆశతో జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు వచ్చిన ప్రజలు, స్పందన కార్యక్రమంలో అధికారులు లేకపోవడంతో నిరాశ నిస్పృహలకు లోను ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల అనాలోచిత చర్యలతో సోమవారం వేరువేరు కార్యక్రమంలను ఏర్పాటు చేయడంతో జిల్లా కలెక్టర్ సహా అధికారులు స్పందన కార్యక్రమంలో అర్జీదారులను కలవలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దీంతో ఎన్నో ప్రయాసలకు లోనయ్యి తమ బాధలు చెప్పుకుందామని వస్తే అధికారులు లేకపోవడం, ఒకవేళ ఉన్నా వారి ఉత్తర్వులను నాయకులు పెడచెవిని పెట్టడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ముందు ముందు స్పందన వల్ల ఎటువంటి ప్రయోజనం కనిపించకోతే ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ప్రజలలో విశ్వాసం కోల్పోతుందన్నారు. ఈ విషయంపై ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని కోరారు.

విజయవాడ డివిజన్ సరకు రవాణాలో 40 రోజుల ముందుగానే లక్ష్యాన్ని అధిగమించాయి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వే డివిజన్ వార్షిక సరుకు రవాణా 30.1 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని 40 రోజుల ముందుగానే సాధించిందని రైల్వే అధికారులు సోమవారం స్పష్టం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసేవేతకు 40 రోజుల ముందుగానే 30.1 మిలియన్ టన్నుల వార్షిక సరకు రవాణా లక్ష్యాన్ని అధిగమించి ఆదాయ లక్ష్యాన్ని రూ. 3257 కోట్లతో విజయవాడ డివిజన్‌కు మరో ఘనతగా నిలిచింది.గత ఏడాదితో పోలిస్తే 59.1% పెరిగిన లోడింగ్‌ను సాధించి 11.20 మెట్రిక్ టన్నులు సంపూర్ణ ఇంక్రిమెంటల్ లోడింగ్‌లో మన డివిజన్ 2వ స్థానంలో ఉంది. తూర్పు మధ్య రైల్వేలో ధన్‌బాద్ డివిజన్ 12.44 ఎమ్‌టీలో మొదటి స్థానంలో ఉంది. భారతీయ రైల్వేల మొత్తం ఇంక్రిమెంటల్ లోడింగ్‌లో 1/8 కంటే ఎక్కువ.విజయవాడ డివిజన్ స్థూల ఆదాయం గత నెల వరకు రూ.4407.01 కోట్లు, సరుకు రవాణా ఆదాయం రూ. 3309.74 కోట్లు. డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం స్థూల ఆదాయంలో మరోసారి 5000 కోట్ల మార్కును అధిగమించనుంది. విజయవాడ డివిజన్ యొక్క అత్యుత్తమ,అత్యధిక ఆదాయాలు 2018-19 సంవత్సరంలో నమోదు చేయబడిన రూ.5136 కోట్లు.డివిజన్‌కు బొగ్గు ప్రధాన కంట్రిబ్యూటర్ వస్తువుగా ఉంది, డివిజన్ నుండి వివిధ ఇతర గమ్యస్థానాలకు రవాణా చేయబడిన సరుకులో దాదాపు 52% వాటా ఉంది. సుమారు 15.12 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేయబడింది.దాదాపు 6 ఎమ్‌టీ ఎరువులు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లోడ్ చేయబడిన రెండవ అత్యధిక సరుకు. కృష్ణపట్నం పోర్ట్ , కాకినాడ పోర్ట్ సైడింగ్స్ డివిజనల్ ఆదాయాలలో వారి ప్రధాన సహకారాలతో కీలక పాత్ర పోషించాయి.ఈ సందర్భంగా డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు ఈ అరుదైన ఘనత సాధించడంలో కమర్షియల్ సిబ్బంది కృషిని కొనియాడారు. డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్ మాట్లాడుతూ రికార్డు స్థాయిలో సరుకు రవాణా లోడింగ్ కోసం వాణిజ్య,నిర్వహణ సిబ్బంది. సాంప్రదాయ వస్తువుల లోడింగ్ వాటాను పెంచడానికి మరియు కోల్పోయిన వస్తువుల ట్రాఫిక్‌ను తిరిగి పొందేందుకు భారతీయ రైల్వే వినియోగదారుల కోసం హేతుబద్ధమైన ధరలకు వివిధ సరుకు రవాణా ప్రోత్సాహక పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు ముందు వార్షిక లోడింగ్ లక్ష్య గణాంకాలను సాధించడంలో సిబ్బంది కృషిని ప్రశంసించారు.